క్లుప్తంగా

పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదం అభినందనీయం

పెదకాకాని: పార్లమెంట్‌లో మహిళా బిల్లును ఆమోదించడం అభినందనీయమని పెదకాకాని సర్పంచి గోళ్ళ స్వరూపరాణి శ్యాంము ఖర్జీబాబు అన్నారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదించడంపై సర్పంచి మాట్లాడుతూ ఈ బిల్లు ద్వారా విద్యా ఉద్యోగ, రాజకీయ రంగాలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం, సంతోషించదగిన పరిణామం. ప్రస్తుతం ఈ బిల్లును ఆమోదించడం ద్వారా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌కు సముచిత స్థానం గౌరవం కల్పించినట్లవుతుందని అన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: భార్యను వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. దర్గా మాన్యంలో నివసించే జంగం రవికిరణ్‌కు స్వాతితో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. రవికిరణ్ మద్యానికి బానిసై భార్యను తరచూ కొడుతూ, వేధిస్తున్నాడు. ఈ మేరకు స్వాతి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

వ్యభిచారానికి పాల్పడుతున్న వ్యక్తిపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నల్లచెరువు తొమ్మిదో లైనులోని ఓ ఇంటిలో వ్యభిచారం జరుగుతోందన్న సమాచారంతో పోలీసులు గురువారం దాడి చేశారు. ఓ వ్యక్తితో పాటు ఇద్దరు మహిళల్ని స్టేషన్‌కు తరలించారు. వ్యక్తిపై కేసు నమోదు చేసి, మహిళల్ని రెస్క్యూ హోంకు తరలించారు.

రుణాలు ఇవ్వాలని కోరుతూ కౌలు రైతుల ధర్నా

తాడేపల్లిరూరల్: కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని కోరుతూ దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలోని యూనియన్ బ్యాంక్ వద్ద ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. కౌలు రైతు సంఘం ప్రధానకార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డు పొందిన ప్రతి కౌలు రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం మండల కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 27న జిల్లా లీడ్ బ్యాంక్ వద్ద ధర్నా నిర్వహించనున్నామని, కౌలు రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం యూనియన్ బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులు భీమవరపు అమ్మిరెడ్డి, చిలువూరు గ్రామ అధ్యక్ష కార్యదర్శులు బి. కనకాంబరం, టి.రామారావు, పిల్లి ప్రభాకరరావు, ఎన్.శేష కుమార్, ఎన్.అవినాష్, ఎన్.గోపాలరావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌బీ పరీక్షలపై ఆరోగ్య సిబ్బందికి శిక్షణ



ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం నుదురుపాడు, ఫిరంగిపురం, పలకలూరు సెక్టార్ పీహెచ్‌సీల ఏఎన్ఎంలకు హిమోగ్లోబిన్ మీటర్లు వాడే విధానం గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బిజినెస్ డెవలప్‌మెంట్ ఇంజినీర్ సిద్ధార్థ ఉపాధ్యాయ మాట్లాడుతూ ముందుగా హెచ్‌బీ మీటర్ కోడ్‌ను సరిచూసుకొని తరువాత పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. పరీక్ష కోసం రక్తనమూన సేకరించే సమయంలో మొదటిసారి వచ్చిన రక్తం చుక్క కాకుండా దానిని దూదితో తుడిచి రెండోసారి వచ్చిన రక్తం చుక్కను మాత్రమే పరీక్ష కోసం వినియోగిస్తే సరైన ఫలితాలు వస్తాయని చెప్పారు. పలు అంశాలపై సూచనలు అందజేసి మిషన్ వాడే విధానం వారికి చూపించారు. కార్యక్రమంలో సర్వీస్ ఇంజినీర్ ఉదయ్ కిరణ్, వైద్యురాలు ఫరీనాబేగం, సిబ్బంది పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు టిఫిన్ బండ్లు అందజేత



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన కోట వెంకాయమ్మ వ్యాపారాభివృద్ధికి సహాయపడే విధంగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తన సొంత ఖర్చులతో టిఫిన్ బండిని తయారు చేయించి వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ గొడవర్తి శ్రీనివాసరావు చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌కె మీర్‌షా, చంద్రరావు, లక్ష్మణ, కృపారావు తదితరులు పాల్గొన్నారు.

–గుండిమెడలో చిరు వ్యాపారం నిర్వహించుకునే గుండిమెడ్ అరుణకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సహకారంతో వైఎస్సార్‌సీపీ రూరల్ మాజీ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి గురువారం టిఫిన్ బండిని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పిడికిలి కృష్ణప్రసాద్, నామతోటి కోటేశ్వరరావు, జెట్టి కోటేశ్వరరావు, నామతోటి వెంకటరావు, గుండిమెడ అమృతరావు, కట్టిపోగు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

వీడుకోలయ్యా.. విఘ్నేశ్వరా..

● భక్తిశ్రద్ధలతో వినాయకుని పూజలు

ప్రత్తిపాడు: గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలి వెళ్లాయి. ముందుగా ప్రత్యేక పూజలు చేసి అనంతరం చిన్నారులు, పెద్దలు కలిసి ఊరేగింపుగా తరలించారు. వీడుకోలయ్యా.. విఘ్నేశ్వరా అంటూ స్థానిక అంకమ్మగుడి సెంటరు వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడిని అందరూ కలిసి నిమజ్జనం చేశారు.

పెదకాకాని మండలంలో..

పెదకాకాని: వినాయక నవరాత్రులు పురస్కరించుకుని వినాయకుడిని భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజించారు. పూజలు నిర్వహించిన రెండవ రోజు నుంచి వైభవంగా గ్రామోత్సవం, నిమజ్జన కార్యక్రమాలు జరుగుతున్నాయి. మండలంలోని ఆయా గ్రామాలలో మూడు రోజుల పాటు పూజలందుకున్న వినాయకుడు మేళతాళాలు, భక్తిగీతాల నడుమ నిమజ్జనానికి తరలి వెళ్ళాడు. మండలంలోని నంబూరు గ్రామంలో జరిగిన వినాయకుని గ్రామోత్సవంలో మహిళలు, చిన్నారులు దీపాలతో బారులు దీరి ముందు నడిచారు. జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటూ నినాదాలు చేస్తూ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. గ్రామోత్సవంలో పలువురు గణనాథునికి పూజ ద్రవ్యములు సమర్పించి భక్తిని చాటుకున్నారు. కనుల పండుగగా గ్రామోత్సవం అనంతరం సమీపంలోని హైలెవల్ చానల్(పాతకాలువ)లో నిమజ్జనం చేశారు.



నంబూరులో నిమజ్జనానికి బయలు దేరిన వినాయకుడు



నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయక విగ్రహాలు





నంబూరులో దీపాల కాంతులలో విఘ్నేశ్వరుని గ్రామోత్సవం

షరతులకు లోబడే నిమజ్జన వేడుకలు



డి. రవీంద్రబాబు,ఎస్ఐ

ప్రత్తిపాడు: వినాయక విగ్రహ కమిటీలు పోలీసుశాఖ నిర్దేశించిన షరతులకు లోబడే నిమజ్జన వేడుకలు నిర్వహించుకోవాలని ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషనులో గురువారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిమజ్జన కార్యక్రమాల్లో పార్టీ జెండాలు గానీ, పార్టీ పాటలు గానీ ప్రదర్శించడానికి వీల్లేదన్నారు. అంతేకాకుండా డీజేలు గానీ, అత్యధిక శబ్ద కాలుష్యాన్ని గానీ వినియోగించవద్దని స్పష్టం చేశారు. గత నిమజ్జన వేడుకల్లో జరిగిన కొట్లాటల సందర్భంగా ఈ ఏడాది ప్రశాంత వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలు జరుపుకునేందుకు పోలీస్ శాఖ కఠిన నిబంధనలను అమలు చేస్తుందని, ప్రజలు సహకరించాలని కోరారు. దేవుడి కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక చింతనతోనే జరుపుకోవాలని, ఇందులో ఎలాంటి ఇతరత్రా కార్యకలాపాలకు తావులేదని చెప్పారు. ఏ చిన్నపాటి ఘటనలు చోటుచేసుకున్నా కమిటీలు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఎక్కడా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీస్ శాఖ కూడా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తుందని వివరించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్ట బద్ధత కల్పించాలి

చేబ్రోలు: ప్రస్తుత పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రమైన చేబ్రోలులో రాస్తారోకో జరిగింది. గత 12 రోజులుగా చేబ్రోలులో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు గురువారం లైబ్రరీ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వేమూరు సుధీర్, నియోజకవర్గ ఇన్‌చార్జి హృదయరాజులు మాట్లాడుతూ 29 సంవత్సరాలుగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి మోసగించిందన్నారు. డేగల బాబు, నంబూరు తబిత, కరుణ, సుందరబాబు, సామ్యేలు, యేసుపాదం తదితరులు పాల్గొన్నారు.



చేబ్రోలు సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అవగాహనతోనే అల్జీమర్స్‌కు కట్టడి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఐ.వి.ఎల్.నరసింహారావు, డాక్టర్ శ్రీరమ్య

గుంటూరు మెడికల్: అవగాహనతో అల్జీమర్స్ వ్యాధిని కట్టడి చేయవచ్చని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు, మానసిక వైద్యనిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఐ.వి.ఎల్.నరసింహారావు అన్నారు. వరల్డ్ అల్జీమర్స్ డేను పురస్కరించుకుని గురువారం స్థానిక కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని మానస హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ 65 సంవత్సరాలు దాటిన వారిలో మతిమరుపు రావడం సహజమని తెలిపారు. అయితే, కొందరిలో దీంతో పాటు మానసిక సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. మందుల ద్వారా వ్యాధిని నియంత్రణతో పెట్టడంతో పాటు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల పాత్ర కూడా కీలకమని పేర్కొన్నారు. అల్జీమర్స్, మానసిక సమస్యల్ని గుర్తించే విధానాలపై రోగుల సహాయకులకు కౌన్సెలింగ్ చేశారు. మానసిక వైద్యుల నిపుణుల సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ అల్జీమర్స్ వ్యాధి వంశపారంపర్యంగా సోకే అవకాశం ఉందన్నారు. జ్ఞాపక శక్తి పెంపొందించే పజిల్స్, కొన్నిరకాల వ్యాయామాల ద్వారా దరిచేరకుండా చూడవచ్చని తెలిపారు. వృద్ధులకు మానస హాస్పటల్‌లో ప్రతినెలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీరమ్య, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో మేలైన వ్యవసాయ పద్ధతులపై పొలంబడి



గోళ్ళమూడి పొలంబడిలో రైతులతో మాట్లాడుతున్న డీఏఓ వెంకటేశ్వర్లు



రైతులకు వేపగింజల కషాయం తయారీని వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

రైతులు అధికంగా రసాయన ఎరువులు వాడితే భూసారం క్షీణిస్తుంది

పెదకాకాని: రైతులు అధికంగా రసాయన ఎరువులు వాడటం ద్వారా భూమి సారవంతం క్షీణించిపోయి దిగుబడులు తగ్గిపోతాయని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని గోళ్ళమూడి గ్రామ శివార్లలో గురువారం వరి సాగుపై పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ పొలంబడి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఏఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు విచక్షణా రహితంగా రసాయన పురుగు మందులు వాడటం వలన చీడపీడలు అధికమవుతాయన్నారు. వాటి నివారణకు అధికంగా పురుగుమందులు పిచికారీ చేయడం వలన నేల సాంద్రత క్షీణించిపోవడమే కాకుండా పర్యావరణ కాలుష్యం కలిగి మానవాళికి క్యాన్సర్ వంటి భయంకర వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. వరి పంటలో దీర్ఘకాలిక అధ్యయనాలైన ఆకుల కత్తిరింపులు, ఆకుల పెరుగుదలపై రైతులకు వివరించారు. కనీస జాగ్రత్తలు పాటించడం ద్వారా వరి పైరులో ఆకుముడత పురుగు నివారణకు ఎటువంటి రసాయన పురుగుమందులు పిచికారీ చేయకపోయినప్పటికీ పంట దిగుబడిలో ఎటువంటి వ్యత్యాసం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ప్రాజెక్ట్ డైరెక్టర్ రామాంజనేయులు, గుంటూరు డివిజన్ ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు, విస్తరణ అధికారి ఆర్‌వీ శివాజీ, వీఏఏ విజయలక్ష్మి, జ్యోత్స్న, గ్రామ వలంటీర్లు, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

తీరనున్న టిడ్కో వాసుల కష్టాలు

● తాగునీరు, విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం
● రూ.1.10 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంక్
● రూ.7.20 కోట్లతో ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం
● తుది దశకు చేరుకున్న పనులు
● ఎమ్మెల్యే ఆర్కే చొరవ

మంగళగిరి: నగరంలోని ఆటోనగర్ వద్ద కల టిడ్కో ఇళ్లల్లోని నిర్వాసితులకు తాగునీరు, విద్యుత్ సరఫరాకు కొద్ది రోజులలోనే శ్వాశత పరిష్కారం లభించనుంది. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవతో పనులు శరవేగంగా కొనసాగుతుండగా ఆయన నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సుమారు 2700 కుటుంబాలు నివసిస్తున్నాయి. జిల్లాలోనే అనేక వసతులతో తొలిసారి నిర్వాసితులకు మంగళగిరిలో పంపిణీ చేశారు. అయితే ఇప్పటివరకు ఏపీఐఐసీ నుంచి తాగునీటిని సరఫరా చేస్తుండగా కార్పొరేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. నిర్వాసితులంతా ఇళ్లల్లోకి రావడంతో సాంకేతిక కారణాలతో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుండటంతో నిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారు. ఇది గమనించిన ఎమ్మెల్యే ఆర్కే వెంటనే తాగునీటి ట్యాంకును యుద్ధప్రాతిపాదికన నిర్మించాలని అధికారులకు సూచించడంతో రూ.1.10 కోట్లతో ట్యాంకు, రూ.7.20 కోట్లతో ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు చేపట్టగా పనులు తుది దశకు చేరుకున్నాయి. విద్యుత్ సరఫరా కోసం ఇండోర్ సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నారు. దీంతో మరికొద్ది రోజుల్లోనే పనులు పూర్తికానుండటంతో టిడ్కో నిర్వాసితులకు తాగునీటి, విద్యుత్ సరఫరాకు శాశ్వత పరిష్కారం లభించనుంది. టిడ్కో ఈఈ ప్రసాద్ మాట్లాడుతూ తాగునీటి ట్యాంకు పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే పూర్తి చేసి పూర్తిస్థాయిలో తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు. విద్యుత్ డీఈఈ అక్కల సత్యనారాయణ మాట్లాడుతూ ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు త్వరలోనే పూర్తి చేసి టిడ్కో నివాసాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అందిస్తామన్నారు.



తుది దశకు చేరుకున్న ట్యాంకు నిర్మాణం

ఐకమత్యంతోనే దళితుల రాజ్యాధికార సాధన

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణ చెల్లదని పార్లమెంటులో కేంద్ర మంత్రులు, అన్ని రాజకీయ పార్టీ ఎంపీలు చెప్పారని, ఇప్పటికైనా మంద కృష్ణ మాదిగ నిజం తెలుసుకొని దళితుల రాజ్యాధికారం కోసం కలసికట్టుగా పని చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ పేర్కొన్నారు. మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన హలో మాల–చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా గురువారం పార్లమెంటులో మంత్రులు, ఎంపీలను కలసి వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా గోళ్ల అరుణ్ కుమార్ మాట్లాడుతూ పార్లమెంటు సాక్షిగా కేంద్ర మంత్రులు, ఎంపీలు ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదని తెలిపినా, మంద కృష్ణ మాదిగ రాజకీయ స్వలాభం కోసమే ఉద్యమాన్ని చేస్తున్నారని విమర్శించారు. ఆయన ఇప్పటికైనా నిజం తెలుసుకొని దళితుల రాజ్యాధికారం సాధించేందుకు కలసికట్టుగా పని చేయాలని కోరారు. ఇప్పటివరకు అగ్రవర్ణ ఆధిపత్యం కింద ఉన్న ఆయన ఆస్తులు పెరిగాయే తప్పా దళితులకు న్యాయం చేసిందేమి లేదని విమర్శించారు. నూతన పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టినందుకు మాల మహానాడు మహిళా నాయకులు, తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బందెల యాదలక్ష్మి, పిల్లి మేరి హర్షం వ్యక్తం చేశారు. నూతన పార్లమెంటులో మొట్టమొదటిగా మహిళా బిల్లు ప్రవేశ పెట్టడం శుభ పరిణామమని తెలిపారు. అనంతరం కేంద్రమంత్రి రాందాస్ అత్వాలేని కలసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోదా జాన్ పాల్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బొగ్గుల మల్లేశం, సిరిసిల్ల అధ్యక్షుడు దోషం చంద్రం, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేందర్, దయాకర్, మాల మహానాడు రాష్ట నాయకులు పాల్గొన్నారు.

కరెన్సీ గణేష్



పూజలందుకుంటున్న గణనాథుడు

పెదనందిపాడు: నగదు అలంకరణలో విఘ్నేశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చాడు. గురువారం రాత్రి మండల పరిధిలోని నాగులపాడు రామాలయం వద్ద శ్రీ రామ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని రూ.22,22,222(ఇరవై రెండు లక్షల ఇరవై రెండు వేల రెండు వందల ఇరవై రెండు) విలువ గల నోట్లతో అలంకరించారు. నగదుతో అలంకరించిన వినాయకుడిని భక్తులు దర్శించుకున్నారు. తదనంతరం దాతలు, గ్రామస్థుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దొప్పలపూడిలో పౌష్టికాహార మహోత్సవం



మహిళకు పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్ హుస్సేన్, రమణారెడ్డి

పొన్నూరు: మండలంలోని దొప్పలపూడి గ్రామ సచివాలయంలో గురువారం ఐసీడీఎస్, నాట్కో ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో పౌష్టికాహార మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు కో–ఆర్డినేటర్ కె.రమణారెడ్డి, మన్నవ ప్రభుత్వ వైద్యశాల డాక్టర్. షేక్ మహమ్మద్ హుస్సేన్ పాల్గొని గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హుస్సేన్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడం వలన రక్తహీనతను అరికట్టవచ్చని తెలిపారు. గర్భిణీగా ఉన్నప్పుడు ప్రతినెల బరువు పెరగాల్సిన అవసరం ఉందని, అందుకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ హేమలత, సిబ్బంది, వైద్య సిబ్బంది గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పోరాటాలకు పుట్టినిల్లు ఎస్టీయూ



ఎస్టీయూ సభ్యత్వ పత్రాలను అందజేస్తున్న నాయకులు

కాకుమాను: పోరాటాలకు పుట్టినిల్లు ఎస్టీయూ అని హక్కులు, బాధ్యతలను రెండు కళ్లుగా భావించి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం ఎస్టీయూ అని ఆ సంఘ గుంటూరు జిల్లా పూర్వ అధ్యక్షులు గేరా మోహనరావు అన్నారు. మండలంలోని గ్రామాలలో ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వమే ఎస్టీయూ ఏర్పడి గత 77 సంవత్సరాలుగా ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై నిరంతరం పోరాడుతోందని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు ఎస్టీయూలో సభ్యులుగా చేరి సంఘ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సంఘంలో సభ్యులుగా నమోదు చేయించారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల శాఖ ప్రధాన కార్యదర్శి కాండ్రు సద్గుణరావు, జిల్లా కార్యదర్శి మద్దిరాల వెంకటేశ్వర్లు, జిల్లా సభ్యులు లంకపల్లి వీరాంజనేయులు, ఆర్థిక కార్యదర్శి శివకోటేశ్వరరావు, సాతులూరి సుబ్బారావు, తుపాకుల వాసు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

● వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం
● గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్



పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కెజియాగ్రేస్

ప్రత్తిపాడు: వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్ అన్నారు. మండల పరిధిలోని రెండు గ్రామాల్లో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను నిర్వహించారు. కొండేపాడులో వైద్యాధికారి డాక్టర్ స్రవంతి 27 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, తుమ్మలపాలెంలో డాక్టర్ కెజియాగ్రేస్ 45 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు పరీక్షలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతలపై వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు లీవ, విజయ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన



పెదకాకాని జెడ్పీ హైస్కూల్‌లో మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న శేఖర్‌బాబు తదితరులు

పెదకాకాని: మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన వారి జీవితం దుర్భరంగా మారుతుందని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు అన్నారు. పెదకాకాని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాలతో బ్రతుకు దుర్భరం చేసుకోవద్దు అన్నారు.. విద్యార్థి దశలో మత్తు పదార్థాలు అలవాటయితే ఏకాగ్రతను కోల్పోతారన్నారు. ముఖ్యంగా విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారికి 'నవజీవన్ బాల భవన్ సంస్థ వారు నూజివీడులో బోస్కో డీ–ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసారన్నారు. యువత డీ అడిక్షన్ కేంద్రాన్ని సంప్రదించి ఉచిత సేవలు పొందవచ్చన్నారు. నంబర్ 9490492020 ను సంప్రదించవచ్చన్నారు. గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపారాణి మాట్లాడుతూ ఈ అవగాహన కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. నవజీవన్ బాల భవన్ వారికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ దుర్గం మధులత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.భాస్కరరావు, నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ బి.రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిల్లులో బీసీ మహిళలకు అన్యాయం

ఇద్వా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి. రాజుసుందరబాబు

నెహ్రూనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హడావుడిగా పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి దానిని ఆమోదింపజేయడం కేవలం రాజకీయ ఎత్తుగడలో భాగమేనని ఐడియల్ దళిత్ ఉమెన్ అసోసియేషన్(ఇద్వా) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు పేర్కొన్నారు. బిల్లులో బీసీ మహిళలకు అన్యాయం జరిగిందని తెలిపారు. అసలు ఎవరికి ఎంత శాతం ఇస్తుందో చెప్పకుండా బిల్లు పాస్ చేయడం ఎన్నికల స్టంట్ అని విమర్శించారు. బిల్లులో లోపాల్ని నిరసిస్తూ గురువారం అంకమ్మ నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ రాజ్యసభలో ప్రవేశపెట్టిన మహిళా బిల్లును నేడు బీజేపీ ప్రభుత్వం హడావుడిగా ప్రవేశ పెట్టి తామేదో మహిళలను ఉద్ధరిస్తున్నట్లు ప్రవర్తించడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. మణిపూర్‌లో దురాగతాల్ని ఐక్యరాజ్యసమితితో పాటు ప్రపంచ వ్యాప్తంగా చర్చించుకుంటున్న సమయంలో ఆ ఆకృత్యాల్ని కప్పిపుచ్చుకునేందుకు బిల్లును తాత్కాలికంగా తెరపైకి తీసుకువచ్చారని మండిపడ్డారు. బీసీ అని చెప్పుకునే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీ మహిళలకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో ఇద్వా కార్యదర్శి అలూరి కోటేశ్వరి, ముక్కు సుష్మ, తాటి సౌమ్య పాల్గొన్నారు.